

బేతంచెర్లలో కోలాటం నడుమ అమ్మవారి విగ్రహం ఊరేగింపు

జగన్మాత.. నమోస్తుతే

శరన్నవరాత్రుల సందర్భంగా విశేష పూజలందుకున్న అమ్మవారికి భక్తులు వీడ్కోలు పలికారు. నంద్యాల పట్టణంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్కు రోడ్డు, ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాల మీదుగా శోభా యాత్ర నిర్వహించారు. అనంతరం చిన్న చెరువు ప్రాంతంలోని వినాయక ఘాట్ వద్ద అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. బేతంచెర్ల, డోన్ తదితర ప్రాంతాల్లో జగన్మాత విగ్రహాలను ఊరేగించారు.

– న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్, రైతునగరం, బేతంచెర్ల



నంద్యాలలో నిమజ్జనం

శ్రీశైలానికి భారీగా వరద

■ 881.60 అడుగులకు చేరిన నీటిమట్టం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 881.60 అడుగులు, నీటి నిల్వ 197.0114 టీఎంసీలుగా నమోదైంది. ఎగువనున్న జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తోంది. సుమారు 1,04,792 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి చేరుతోందని అంచనా వేస్తున్నారు. మరోవైపు కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 54,148 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు వరద నీరు భారీగా వస్తుండటంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. పైనుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని నిత్యం గమనిస్తూ అందుకనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.


అక్రమాలకు సహకారం

■ నిధులు పక్కదారి పట్టిస్తున్న సిబ్బంది

■ రైతులకు రుణాలివ్వడంలో నిర్లక్ష్యం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పది లక్షల హెక్టార్లలో సాగు భూమి ఉండగా.. 7.30 లక్షల మంది రైతులున్నారు. 99 ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో 1.50 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 25 సహకార బ్యాంకు శాఖలు ఉన్నాయి. 2024-25 సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి రైతులకు రూ.20 కోట్ల పంట రుణాలు, కౌలుదారులకు రూ.10 కోట్లు కలిపి మొత్తం రూ.30 కోట్ల మేర రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. 99 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండగా కల్లూరు, ఓర్వకల్లు మండలం హుసేనాపురం, ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల, జూపాడుబంగ్లా మండలం 80 బన్నూరు సొసైటీ పరిధిలో 44 మంది కొత్త రైతులకు రూ.68.31 లక్షలు, పాత రైతులు మరో నలుగురికి రూ.5.10 లక్షలు కలిపి 48 మంది రైతులకు రూ.73.41 లక్షల రుణాలు పంపిణీ చేశారు.



ఉమ్మడి కర్నూలు జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకు శాఖలపై అధికారుల పర్యవేక్షణ కరవైంది. కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా నగదును తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. మరికొందరు డీసీసీబీని సంప్రదించకుండానే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. సహకార బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాల్సిన వారే బ్యాంకుకు కన్నం వేస్తున్నారు. ఫలితంగా అభివృద్ధి మాట దేవుడెరుగు.. నష్టాల ఊబిలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడింది.

● ఆత్మకూరు సహకార బ్యాంకులో క్యాషియర్‌గా పని చేస్తున్న అల్తాఫ్ రూ.78.77 లక్షలు స్వాహా చేశారు. బ్యాంకు నగదును తన అవసరాలకు, సొంత వ్యాపారానికి వాడుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ ఘటనలో అల్తాఫ్‌తో పాటు పాసింగ్ ఆఫీసర్ వెంకటరంగయ్య, నిర్లక్ష్యంగా వ్యవహరించిన బ్యాంకు మేనేజర్ పెద్ద పులిరాజును సస్పెండ్ చేశారు. ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

● డీసీసీబీ అనుమతి లేకుండా వెలుగోడు సహకార బ్యాంకు మేనేజర్ నారాయణ రెడ్డి తన స్వీయ నిర్ణయాధికారంతో రూ.10 లక్షలను వెలుగోడు సొసైటీకి ఏడు నెలల కిందట మంజూరు చేశారు. ఆయన్ను పది రోజుల కిందట బనగానపల్లికి బదిలీ చేసినా రిలీవ్ కాలేదు. డీసీసీబీకి ముందస్తు సమాచారం ఇవ్వకుండా.. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడంతో సస్పెన్షన్ వేటు వేశారు.

కొందరి నిర్వాకంతో..

మూడున్నర దశాబ్దాలపాటు నష్టాల్లో కూరుకుపోయిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఇప్పుడిప్పుడే లాభాలబాట పడుతోంది.. అలాంటి తరుణంలో బ్యాంకులో పనిచేసే కొందరు అధికారులు, సిబ్బంది నిర్వాకం కారణంగా తిరిగి నష్టాల్లోకి పయనించే పరిస్థితి నెలకొంది. బ్యాంకును సమర్థంగా నడిపించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనపై పట్టు లేకపోవడంతో కొందరు కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

లక్ష్యం రూ.300 కోట్లు..

సహకార బ్యాంకు శాఖల ద్వారా దీర్ఘకాలిక రుణాలను వ్యవసాయ, అనుబంధ శాఖలకు ఇవ్వాలని నిర్ణయించారు. పొట్టేళ్ల పెంపకం, పాడి గేదెలు, వ్యవసాయ పరికరాలతోపాటు ఉద్యాన పంటల సాగు తదితరాలకు ఉమ్మడి జిల్లాలో రూ.300 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఆలూరు, కర్నూలు కృష్ణానగర్, ఓల్డ్‌టౌన్, నందికొట్కూరు సహకార శాఖల పరిధిలో గొర్రెలు, పొట్టేళ్ల పెంపకానికి సంబంధించి ఏడు యూనిట్లకు రూ.57.74 లక్షల రుణాలు ఇచ్చారు. ఆలూరు, కృష్ణానగర్ శాఖల్లో ఉద్యాన పంటలకు సంబంధించి రెండు యూనిట్లకు రూ.36 లక్షల రుణాలిచ్చారు. మొత్తం తొమ్మిది మంది రైతులకు రూ.93.74 లక్షల దీర్ఘకాలిక రుణాలు మాత్రమే ఇచ్చారు.

● ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.330 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించుకోగా ఏడు నెలలవుతున్నా 57 మంది రైతులకు రూ.1.67 కోట్ల రుణాలు మాత్రమే పంపిణీ చేయడం గమనార్హం.

కంప్యూటరీకరణ ఎప్పుడో..

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) దస్త్రాల కంప్యూటరీకరణ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తైతే తాము చేసిన అక్రమాలు బయటపడతాయన్న ఉద్దేశంతో కొందరు ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అక్టోబరు 2తో గడువు ముగిసినా ఇప్పటివరకు ఒక్క సొసైటీలోనూ కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తికాలేదు. మరికొన్నింటిలో మొక్కుబడిగా పనులు మొదలు పెట్టారు.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. 14వ తేదీ నుంచి పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే మద్యం దుకాణాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆమె ఆదివారం వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

టెట్‌కు 139 మంది గైర్హాజరు

పాణ్యం గ్రామీణం, నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 139 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో2 సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 280 మంది అభ్యర్థులకు 253, మధ్యాహ్నం 280కు 256, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో 200కు 182, 200 మందికి 170, నంద్యాల ఎస్వీఆర్ కళాశాలలో ఉదయం 175కు 156, మధ్యాహ్నం 175 మందికి 154 మంది పరీక్ష రాసినట్లు వివరించారు. మరోవైపు ఎలాంటి ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని జిల్లా అధికారులు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్నిరకాల చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.



స్వామి, అమ్మవార్లకు ఆలయ ఉత్సవం



పుష్కరిణిలో తెప్పోత్సవం

నేత్రానందం..

ఆది దంపతుల తెప్పోత్సవం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో అర్చకులు, వేద పండితులు మండపారాధనలు, కలశార్చనలు, జపానుష్ఠానాలు, విశేష కుంకుమార్చనలు, చండీహోమం, రుద్రహోమం, రుద్రయాగ పూర్ణాహుతి తదితరాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కలశోద్వాసన, వసంతోత్సవం, చండీశ్వరునికి మల్లికాగుండంలో అవభృథ స్నానం, త్రిశూలస్నానం జరిపించారు. సాయంత్రం 6.30 గంటలకు భ్రమరాంబాదేవి నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కళాకారుల నృత్య సందడి మధ్య స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ, ఆలయ ఉత్సవం జరిపారు. రంగు రంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో ముస్తాబు చేసిన తెప్పపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు దంపతులు, అర్చకులు, వేదపండితులు సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. భక్తజన శివనామ స్మరణల మధ్య తెప్పోత్సవం శోభాయమానంగా జరిగింది.





కర్రలతో తలపడుతున్న గ్రామాల ప్రజలు

దేవరగట్టు.. ఆచారానిదే పట్టు

■ కర్రల సమరంలో 100 మందికిపైగా గాయాలు

చేతిలో కర్రలు.. అగ్గి దివిటీలు.. డిర్ర్ గో పరాక్ అంటూ ఓవైపు... డోళ్లు వాయిస్తూ స్వామి జైత్రయాత్ర మరోవైపు.. ఆంక్షలు దాటుకొని.. ఆచారం ముందుకు సాగింది. దసరా పండగ రోజున అర్ధరాత్రి వేళ స్వామివారి బన్ని ఉత్సవం సాగింది. హొళగుంద మండలం దేవరగట్టుపై కొలువుదీరిన మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్ర శనివారం అర్ధరాత్రి ఆరంభమై ఆదివారం తెల్లవారుజాము వరకు సాగింది. ఈ కర్రల సమరంలో 100 మందికిపైగా గాయపడ్డారు.

ఆలూరు గ్రామీణం, హాలహర్వి, హొళగుంద, న్యూస్‌టుడే :

దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో భాగంగా నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల ప్రజలు కలిసికట్టుగా వచ్చి డొల్లనబండ వద్ద బాస చేశారు. అనంతరం గ్రామ పెద్దలు ఎస్పీ బిందు మాధవ్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వద్దకు వచ్చి ఉత్సవాలను నిర్వహించుకునేందుకు బండారు ఇచ్చి అనుమతి తీసుకున్నారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపించారు. అనంతరం మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్ర ప్రారంభమైంది. ఉత్సవమూర్తులను తీసుకెళ్లే సమయంలో నెర

ఉత్సవం సాగిందిలా..

ణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాల భక్తులు ఓవైపు.. అరికెర, అరికెరతండా, సుళువాయి, ఎల్లార్తి, బిళేహాలు ప్రజలు మరోవైపు ఉండి కర్రల సమర సంప్రదాయం కొనసాగించారు. కర్రలతో దాడులు చేసుకోవడంతో చాలామంది తలలు పగిలాయి. అనంతరం ఉత్సవ విగ్రహాలను పాదాలకట్ట, ముల్లబండ, రక్షపడ వరకు చేర్చారు. గొరవయ్య పిడికెడు రక్తం సమర్పించి శమీ వృక్షం వద్దకు చేరుకుని పూజలు చేసి ఎదురు బసవన్నగుడికి చేరుకున్నారు. అనంతరం ఉత్సవమూర్తులను తిరిగి సింహాసనం కట్టకు చేర్చడంతో జైత్రయాత్ర ముగిసింది. ఎదురు బసవన్నగుడి వద్ద గిరిమల్లయ్యస్వామి కార్ణికం చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని చెప్పారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.



చికిత్స పొందుతున్న బాధితుడు

లక్కీ డిప్ ఎవరికో

■ నేడు మద్యం దుకాణాల అనుమతులు ఖరారు



ప్రాంతం	దుకాణాలు	దరఖాస్తులు
కేంద్రం నంద్యాల	24	735
బనగానపల్లి	12	168
కోవెలకుంట్ల	11	150
డోన్	16	386
నందికొట్కూరు	10	182
ఆత్మకూరు	13	272
ఆళ్లగడ్డ	19	326

జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణకు సంబంధించిన అనుమతులను సోమవారం ఖరారు చేయనున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమంలో లక్కీడిప్ ద్వారా మద్యం దుకాణాలు కేటాయించనున్నారు. కలెక్టర్ జి.రాజకుమారి ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ లక్కీడిప్ నిర్వహించనుంది. ఈనెల 11వ తేదీ వరకు జిల్లాలో 105 మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించారు. 105 మద్యం దుకాణాలకు 2,219 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ఒక్క నంద్యాల జిల్లా నుంచే ప్రభుత్వానికి రూ.44.38 కోట్ల ఆదాయం సమకూరింది.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే :

గట్టి బందోబస్తు

కలెక్టరేట్‌లో లక్కీడిప్ నిర్వహించనుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అనుమతులు దక్కించుకున్న వ్యక్తులకు తగిన భద్రత కల్పించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించిన నేపథ్యంలో పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. మద్యం దుకాణాలకు సంబంధించి అనుమతులు దక్కించుకున్నవారు వీటిని నిర్వహించుకునేందుకు అధికారులు ఆమోద ముద్ర వేయనున్నారు.

ఉదయం 6 గంటల నుంచే..

పాసులు పొందిన దరఖాస్తుదారులను ఉదయం ఆరు గంటల నుంచే కలెక్టరేట్‌లోకి అనుమతించనున్నారు. వరుస ప్రకారం మొదట నంద్యాల, బనగానపల్లి, కోవెలకుంట్ల, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ ఎక్సైజ్ స్టేషన్ల ప్రకారం డిప్ నిర్వహించి అనుమతులు మంజూరు చేస్తారు. లక్కీడిప్ నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

సాగు.. కనెక్షన్లలో జాగు

■ వేలాది మంది రైతుల ఎదురుచూపు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు సమస్యలు ఎదురవుతున్నాయి. రైతులు దరఖాస్తు చేసుకున్నా అధికారులు దృష్టి సారించడం లేదు. బోర్లు వేసుకున్నా కనెక్షన్ లేకపోవడంతో పొలాలు సాగు చేయలేని పరిస్థితి. ఉమ్మడి జిల్లా పరిధిలో 10,523 మంది రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనికిగాను డీడీల రూపంలో సుమారు రూ.30.23 కోట్ల వరకు చెల్లించారు. నెలలు గడుస్తున్నా ఆ శాఖ అధికారులు కనెక్షన్లు ఇవ్వడంలో అలక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం లేకపోతోంది.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే :

తన పొలానికి విద్యుత్తు సర్వీసు కావాలంటూ కోవెలకుంట్లకు చెందిన సుబ్బారెడ్డి తొమ్మిది నెలల కిందట డీడీ తీసి విద్యుత్తు శాఖ అధికారులకు దరఖాస్తు చేశారు. నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించలేదు. ఎన్నికల పేరు చెప్పి కొన్ని రోజులు.. కొత్త ప్రభుత్వం వచ్చిందని ఇంకొన్ని రోజులు సాకులు చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సామగ్రి లేదంటూ..

రైతుల దరఖాస్తులకు తగ్గట్టు అవసరమైన సామగ్రి విద్యుత్తు శాఖలోని స్టోర్‌లో అందుబాటులో లేదు. 2 వేల కి.మీ. పొడవునా అవసరమైన కండక్టర్లు, 25 కేవీ సామర్థ్యమున్న 3,100 నియంత్రికలు, 500 కి.మీ. కేబుళ్లు కావాల్సి ఉంది. కర్నూలులోని స్టోర్‌లో వ్యవసాయ సర్వీసులకు సంబంధించి కండక్టర్లు గానీ.. 25 కేవీ నియంత్రికలు, కేబుళ్లు అందుబాటులో లేవు. గతేడాది మార్చి నుంచి అవి స్టోర్‌కు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వలేకపోతున్నామని పేర్కొంటున్నారు.



రూ.వేలు ఖర్చు చేసి..


వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇస్తారన్న ఆశతో పలువురు రైతులు తమ పొలాలను చదును చేసి సిద్ధం చేసుకున్నారు. గడివేముల, మిడుతూరు, ఆత్మకూరు, కొత్తపల్లె, పాములపాడు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో రైతులు తమ పొలాలను చదును చేసేందుకుగాను రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేశారు. కర్నూలు జిల్లాలోని పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, గోనెగండ్ల తదితర ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు సమస్యను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసినా ప్రయోజనం శూన్యమే. తమ వద్ద అవసరమైన విద్యుత్తు సామగ్రి లేదని, సరఫరా చేసిన వెంటనే సర్వీసులు ఇస్తామని పేర్కొంటున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

నంద్యాల డివిజన్ పరిధిలో 1,823 మంది రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు. రూ.2 కోట్ల వరకు డీడీలు తీసి నెలలు గడుస్తున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంతో తమకీ గతి పట్టిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు కార్యాలయాలకు అవసరమైన సామగ్రిపై గత ప్రభుత్వం శ్రద్ధ చూపి ఉంటే ప్రస్తుతం ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదని పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

నేటి నుంచి పల్లె పండగ

■ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,877 పనులు



కర్నూలు నగరం, న్యూస్‌టుడే : ప్రతి పల్లెకు రహదారి వసతి కల్పించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె పండగ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 14వ తేదీ నుంచి వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ పాలకులు పాల్గొంటారు. కర్నూలు జిల్లాలో 852 రహదారులకు రూ.81.40 కోట్లు, నంద్యాల జిల్లాలో 1,025 రోడ్ల నిర్మాణాలకు రూ.86 కోట్ల మేర ఖర్చు చేయనున్నారు. దీనికి ఉపాధి నిధులు వెచ్చించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు.. గ్రామాల్లో చక్కటి రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో జరిగే కార్యక్రమంలో మంత్రి ఫరూక్ పాల్గొంటారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం

గత వైకాపా ప్రభుత్వం పంచాయతీ నిధులను పక్కదారి పట్టించింది. ఫలితంగా గ్రామాల్లో వసతులు కరవయ్యాయి. కనీసం పారిశుద్ధ్య పనులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. దశాబ్దాలు గడుస్తున్నా చాలా ప్రాంతాలకు రహదారి సౌకర్యం లేదు. గత ప్రభుత్వ హయాంలో పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాలకు మంచిరోజులు వచ్చాయి. పల్లెవాసుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి నిధులతో రహదారులు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు నడుం బిగించింది. ప్రతి గ్రామంలోనూ పనులు ప్రారంభించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

భారీ వర్షాలతో అప్రమత్తత అవసరం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారులను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా అధికారులు సైతం అప్రమత్తమయ్యారు. జిల్లాలో 16వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా కోరారు. ఆయన ఆదివారం సబ్ కలెక్టర్‌తోపాటు ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల ప్రత్యేకాధికారులు తదితరులతో టెలీ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేసి అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. మండల, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా మండల, డివిజన్ కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న మట్టి మిద్దెలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని పేర్కొన్నారు. అవసరమైతే ప్రజలకు అందజేసేందుకు నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు. భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల వారిని తరలించేందుకు వీలుగా భవనాలను గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: పూజా కైంకర్యాల్లో జరిగిన తప్పులు, దోషాల నివారణ, లోకకల్యాణాన్ని నిర్వహించే పవిత్రోత్సవాలు అహోబిలంలో ఘనంగా ఆరంభమయ్యాయి. శనివారం సాయంత్రం ఉత్సవాలకు ఎగువ అహోబిలంలో అంకురార్పణ జరిపారు. ఆదివారం ఉదయం జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను నవకలశాలతో పంచామృతాలతో అభిషేకం జరిపారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమమండపంలో స్వామి, అమ్మవార్లను కొలువుంచి పవిత్రారోపణం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఉత్సవం జరిపారు. రాత్రి నిత్యపూజలు చేసి హోమం నిర్వహించి మంగళహారతి అందించారు. ఈ పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు


పవిత్రాలతో ఉత్సవమూర్తులు

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి రక్షణ

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో విద్యార్థులకు చదువుతో పాటు వృత్తిపర అంశాల్లో అవగాహన కల్పించడంతో పాటు విషయాలు నేర్చుకోగలిగారు. ప్రభుత్వ పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సమగ్రశిక్ష స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల జిల్లాలో 20 ఆదర్శ పాఠశాలలు, 24 జడ్పీ ఉన్నత పాఠశాలలు, 11 కేజీబీవీలు, 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 3 సాంఘిక సంక్షేమ, ఒక గిరిజన సంక్షేమ, రెండు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో వృత్తి విద్యను అమలు చేస్తున్నట్లు జీసీడీవో నాగసువర్చల తెలిపారు. ఒక్కో పాఠశాలలో రెండు సెక్టార్లు ఉండగా, ఒక్కో సెక్టార్‌లో ఒక్కో ట్రేడ్‌లో 40 మంది వివిధ ట్రేడ్లలో ఏడాదికి 80 గంటల పాటు శిక్షణ పొందనున్నారని తెలిపారు.

37 పాఠశాలల విద్యార్థులకు అవకాశం

తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థులకు ఈనెల 2 నుంచి స్థానిక పరిశ్రమలు, ఐటీ కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, అగ్రికల్చర్, బ్యూటీపార్లర్, అల్లికలు, కుట్లు, హెల్త్ కేర్, బీఎఫ్ఎస్ఐ, ఆటోమోటివ్, ఫుడ్ ప్రాసెసింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో వారి సందేహాలు నివృత్తి చేశారు. 37 పాఠశాలల్లోని వృత్తివిద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ట్రేడుల వారీగా ఆయా విభాగాల్లో అన్ని అంశాలు తెలియజేస్తున్నారు. ఈ సెలవుల్లో అనివార్యకారణాలతో శిక్షణ పొందని వారికి సంక్రాంతి, వేసవి సెలవుల్లో తర్ఫీదు ఇప్పించనున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.


బైక్ మరమ్మతులపై విద్యార్థులకు అవగాహన

కంప్యూటర్‌పై అవగాహన పెరిగింది

- శరణ్య



డోన్ పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఆంగ్లమాధ్యమంలో చదువుతున్నాను. వృత్తివిద్యాకోర్సుల్లో భాగంగా ఎలక్ట్రానిక్స్ ఎంచుకున్నా. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్‌లో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నాను. నోట్‌ప్యాడ్, వర్డ్ ప్యాడ్, పవర్‌పాయింట్, ఎక్సెల్(ఎంఎస్ ఆఫీస్)లో అవగాహన కలిగింది.

ఇదో చక్కటి అవకాశం

- ఆసిఫ్



ఆంగ్ల మాధ్యమంలో పదోతరగతి చదువుతున్నాను. బైక్ మెకానిక్ షాప్‌లో శిక్షణ పొందాను. యంత్రాలు, బ్యాటరీలు, పరికరాలపై అవగాహనతో పాటు వాటిని అమర్చే విధానంపై చాలా విషయాలు తెలిశాయి. ఉద్యోగాలకు ఎదురు చూడక స్వశక్తితో షాపును నిర్వహించి ఉపాధి పొందేందుకు ఇదో చక్కటి అవకాశం.

స్థానికంగానే తర్ఫీదు

- జి.నాగసువర్చల, జీసీడీవో, నంద్యాల

సహ పాఠ్యాంశాల్లో నిష్ణాతులు పొందేందుకు ఇదో మంచి అవకాశం. శిక్షణ నైపుణ్యాలతో జీవితంలో స్థిరపడే విధంగా ఉపాధి అవకాశాలు పొందేందుకు చక్కటి మార్గం. జిల్లాలో 37 పాఠశాలల్లో వివిధ ట్రేడుల్లో స్థానికంగానే విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తున్నాం.

ఘనంగా పల్లకి ఉత్సవం

బనగానపల్లె (గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లె మండల పరిధిలోని పలు గ్రామాల్లో విజయదశమిని పురస్కరించుకుని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పల్లకి ఉత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పల్లకిలో స్వామి, అమ్మవార్లు

చౌడేశ్వరిదేవి నిజరూప దర్శనం

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరంలోని చౌడేశ్వరి అమ్మవారి కోవెలలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. విజయదశమిని పురస్కరించుకుని అమ్మవారు నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా కన్పించింది. చౌడేశ్వరి ఆలయంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అధికారిణి కల్యాణి పూజలు జరిపారు.


అమ్మకు అలంకరణ

ఉత్సవమూర్తులకు అభిషేకాలు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో జమ్మి ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదాంత దేశికన్ జయంతి సందర్భంగా ప్రహ్లాదవరద స్వామి,శ్రీదేవి,భూదేవి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం జరిపారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. వేదాంత దేశికన్ ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించి మంగళశాసనం చేశారు. సాయంత్రం విశేష అలంకరణలో ప్రహ్లాదవరదస్వామి బంగారు పూతతో ఉన్న మంగళగిరి పీఠంపై కొలువుదీరి పార్వేటకు బయలుదేరారు. గ్రామ శివార్ల లోని చెంచుగూడెం సమీపంలోని జమ్మి చెట్టు వద్దకు వేంచేశారు. జమ్మి చెట్టుకు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి అర్చకులు చెట్టుకు బాణాలు సంధించారు. ఆ తర్వాత ఆలయానికి చేరుకొని విశేష శాత్తుమురై జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు.


స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

దసరా వేడుకల్లో ప్రజాప్రతినిధులు

నంద్యాల గాంధీ చౌక్, న్యూస్‌టుడే : వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ అమ్మవారు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి పురవీధుల గుండా వాసవీమాత గ్రామోత్సవం నిర్వహించారు. నశ్యం వీధిలోకి వచ్చిన అమ్మవారికి మంత్రి ఫరూక్ పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేకంగా దీపాలతో హారతులు ఇచ్చారు. నందికొట్కూరులో జరిగిన వేడుకల్లో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. బాణం సంధించి రావణ ప్రతిమను దహనం చేశారు. నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో నిర్వహించిన గ్రామోత్సవంలో ఎమ్మెల్యే జయసూర్య అమ్మవారి పల్లకి మోశారు.


వాసవి కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న మంత్రి ఫరూక్


విల్లు ఎక్కుపెడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

కొత్తూరులో కలెక్టర్ దంపతుల పూజలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఎస్. కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కలెక్టర్ రాజకుమారి దంపతులు, కుటుంబ సభ్యులు పూజలు చేశారు. ఆదివారం వారు ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని క్షీరాభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. పూజల అనంతరం కలెక్టర్ దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు.



సెల్ఫీ మోజులో ప్రమాదం

క్రైం కార్నర్

మహానంది, న్యూస్‌టుడే : మహానంది మండలం అయ్యన్ననగర్ సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాల్వలో శనివారం గల్లంతయిన బాలుడి కోసం పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది గాలింపు కొనసాగిస్తున్నారు. ఎస్సై ఎన్. రామమోహన్‌రెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్సార్ జిల్లా బద్వేలు పట్టణం ఐలమ్మకాలనీకి చెందిన 17 ఏళ్ల సురసుర గౌతమ్, ఇతని బావ మహేశ్ ఇద్దరూ మహానందిలోని ఈశ్వర్ నగర్‌లో బంధువుల వివాహానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. తెలుగుగంగ కాల్వ వద్ద సెల్ఫీ తీసుకునేందుకు దిగారు. మహేశ్ ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోగా ఆయన్ని కాపాడేందుకు గౌతమ్ దూకాడు. ఈత రాకపోయినప్పటికీ మహేశ్ చెట్ల కొమ్మలు పట్టుకుని బయటపడ్డారు. గౌతమ్‌కు ఈత వచ్చినప్పటికీ ప్రవాహ ఉద్ధృతికి కాల్వలో కొట్టుకుపోయాడు. గౌతమ్ తల్లి మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు స్వీకరించి, గాలింపు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వివరించారు.


గౌతమ్ (పాత చిత్రం)

ఎస్సార్బీసీలో జారి పడి..

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రమాదవశాత్తు ఎస్సార్బీసీ కాల్వలో జారి పడి ఓ మహిళ గల్లంతైన ఘటన పాణ్యంలో చోటుచేసుకుంది. గూడూరు మండలం చను గొండ్ల గ్రామానికి చెందిన జార్జికి ముగ్గురు భార్యలు పద్మ, వెన్నెల (18), గంగోత్రి ఉన్నారు. వారితో కలిసి రేణిగుంటకు వెళ్లి తాపి పనిచేసుకుంటూ జీవనం సాగించేవారు. పనులు అయిపోవడంతో శనివారం తిరిగి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరి రాత్రి ఒంటిమిట్ట వద్ద బస చేశారు. ఆదివారం ఉదయం స్వగ్రామానికి బయలుదేరిన వారు మార్గ మధ్యలో పాణ్యం వద్ద ఎస్సార్బీసీ కాల్వలో స్నానం చేయడానికి ఆగారు. మెట్లపై కూర్చుని స్నానం చేస్తున్న రెండో భార్య వెన్నెల ప్రమాదవశాత్తు జారి కాల్వలో పడిపోయారు. నీటిలో కొట్టుకుపోయిన ఆమె పక్కనే ఉన్న బ్లాక్ 3 పంట కాల్వ డైవర్షన్ వద్ద ప్రవాహ ఉద్ధృతిలో మునిగిపోయారు. స్థానికులతో కలిసి కాల్వలో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.


వెన్నెల (పాత చిత్రం)

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

మీరాపురం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక మండల పరిధిలోని మీరాపురంలో మహిళ ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు తెలిపారు. మీరాపురానికి చెందిన మాదన్న భార్య రంగమ్మ కడుపు నొప్పి తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడటంతో గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను బనగానపల్లి వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందన్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. బనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తి చెంది..

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని దుర్వేశి గ్రామానికి చెందిన పోతిరెడ్డి నారాయణరెడ్డి (76) ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జీవితంపై విరక్తి చెంది ఆదివారం విషద్రావణం తాగాడన్నారు. కుటుంబ సభ్యులు నంద్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. కుమారుడు గోపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

తుంగభద్రకు భారీగా వరద

హాలహర్వి న్యూస్‌టుడే : ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు తాగు, సాగు నీరు అందించే జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం భారీగా కొనసాగుతుందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు 88,588 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరిందన్నారు. భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో 20 గేట్లను 2.5 అడుగుల మేరకు ఎత్తి 73,260 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. మిగిలిన 15 వేల క్యూసెక్కుల నీటిని వివిధ కాల్వలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 101.66 టీఎంసీలు నీటి నిల్వ ఉందన్నారు. గతేడాది ఈ సమయానికి 47.83 టీఎంసీలు నీటి నిల్వ ఉండేదని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది నీరు సమృద్ధిగా ఉండటంతో రెండో పంటకు నీటి ఇబ్బందులు ఉండవని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ శబరికి విక్టోరియన్ పార్లమెంట్ ఆహ్వానం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి మెల్‌బోర్న్- విక్టోరియా ప్రభుత్వ శాసన మండలి విప్, మిస్టర్ లీ తర్లామిస్ నుంచి ఆహ్వానం అందింది. అక్టోబరు 17-19 వరకు జరిగే విక్టోరియన్ పార్లమెంట్ సమావేశాలకు ఆమె హాజరుకానున్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు బైరెడ్డి శబరి కృతజ్ఞతలు తెలిపారు.

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

పల్లె పండగను విజయవంతం చేయాలి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పల్లె పండగ-పంచాయతీ రాజ్ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో సుగుణశ్రీ కోరారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. 14వ తేదీన కానాల, అయ్యలూరు, చాపిరేవుల గ్రామాల్లో, 15న బిల్లలాపురం, కొత్తపల్లె, 16న పుసులూరు, బ్రాహ్మణపల్లె, 17న పాండురంగాపురం, 18న చాబోలు, భీమవరం, రాయమాల్పురం, మునుగాల, 1న పులిమద్ది, పోలూరు, మిట్నాల, గుంతనాల, 20న పెద్దకొట్టాల గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో సోమవారం జరుగనున్న కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొంటారని ఆమె వెల్లడించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని చిత్తలూరివారి వీధిలో ఉన్న శ్రీకృష్ణ భజన మందిరంలో ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం వేణుగోపాలకృష్ణ స్వామికి తెల్లవారుజామునే పంచామృతాభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) నందికొట్కూరు : 94403 61729 ఆత్మకూరు : 90149 09024 నంద్యాల : 98853 28120

ఆత్మకూరు పట్టణం : సమస్య : ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల మలుపులో పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా మారింది. - షబ్బీర్

సమస్య : సంగమేశ్వరం సర్కిల్ నుంచి ఆర్డీటీ కాలనీకి వెళ్లే మార్గంలో వీధిదీపం వెలగడం లేదు. - రమణ

సమాధానం : కార్మికులకు సూచించి గుంత పూడ్చివేయిస్తాం. వీధిదీపానికి మరమ్మతులు చేయిస్తాం. - షాహీర్‌బాషా, పురపాలక ఏఈ

అన్నదానానికి రూ.51 వేల విరాళం


దాతకు గుర్తింపుపత్రాలు అందజేస్తున్న ప్రొటోకాల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వై. నవీన్, నాగిని దంపతులు దసరా రోజు రూ.51 వేల విరాళం అందజేశారు. వారికి ఆలయ ప్రొటోకాల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎస్. శ్రీనివాసులు గుర్తింపు పత్రాలను అందజేశారు. వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : మహానంది మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన రైతు పెరుమల్ల బాలవెంకటయ్య వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నంద్యాలలో ఆదివారం తెదేపా రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్‌ను కలిసి చెక్కును అందజేశారు.

స్థిరాస్తి.. సుస్తీ

◆ చతికిలపడ్డ వ్యాపారం
◆ భారీగా పడిపోయిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : స్థిరాస్తి వ్యాపారం చతికిలపడింది. గతేడాదితో పోలిస్తే స్థలాల రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గిపోయాయి. దీంతో సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఆదాయం కోల్పోయాయి. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో సంస్కరణల పేరుతో తీసుకొచ్చిన నూతన విధానాలు క్షేత్రస్థాయిలో ప్రతికూల ఫలితాన్ని ఇస్తున్నాయి. ఈ పద్ధతులు ప్రజలకు ఉపయోగపడే విధంగా లేకపోగా, వారిని మరింత కష్టాల్లోకి నెట్టాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్ల శాఖపై ప్రభావం చూపాయి.


మందగించిన భూముల క్రయ, విక్రయాలు

రీసర్వేతో చిక్కులు

వైకాపా ప్రభుత్వం రెండేళ్ల కిందట తీసుకొచ్చిన ఎల్‌పీఎం పద్ధతి రైతులను తీవ్ర ఇబ్బందులు పెట్టింది. గతంలో సర్వే నంబర్ల వారీగా పొలాల వివరాలు ఉండేవి. ప్రస్తుతం ఒక ఎల్‌పీఎంలో పలువురి పొలాలు ఉన్నాయి. అందులో ఒక రైతు తన పొలం విక్రయించినా మొత్తం పొలాల వివరాలు చూపెడుతూ గందరగోళం తలెత్తుతోంది. మరోవైపు వైకాపా ప్రభుత్వం హడావుడి చేపట్టిన రీసర్వే పలు సమస్యలకు కారణమవుతోంది. ఆన్‌లైన్‌లో భూముల వివరాలను తప్పులతడకగా నమోదు చేశారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేశారు. దీంతో సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు పెద్ద ఎత్తున ఆదాయం కోల్పోయాయి.

☛ నంద్యాల సబ్ రిజిస్ట్రారు కార్యాలయం పరిధిలోని 6 గ్రామాల్లో, బండిఆత్మకూరులో 6, పాణ్యంలో 6, ఆత్మకూరు 8, నందికొట్కూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయం పరిధిలోని 7 గ్రామాల్లో ఏడాదిగా రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. దీంతో భూముల క్రయ విక్రయాలు లేక రిజిస్ట్రేషన్ల కార్యాలయాలు పెద్ద ఎత్తున ఆదాయం కోల్పోయాయి.

2023- 24 ఆర్థిక సంవత్సరం ఆరు నెలల ఆదాయం

కార్యాలయం	లక్ష్యం (రూ.కోట్లలో)	సాధించినది (రూ.కోట్లలో)	శాతం
నంద్యాల	31.15	21.64	69.69
బండిఆత్మకూరు	3.32	2.48	73.83
ఆత్మకూరు	5.44	3.94	72.51
నందికొట్కూరు	9.70	6.91	71.30
పాణ్యం	3.83	2.82	73.84

2024- 25 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల ఆదాయం

కార్యాలయం	లక్ష్యం (రూ.కోట్లలో)	సాధించినది (రూ.కోట్లలో)	శాతం
నంద్యాల	34.33	18.03	52.52
బండిఆత్మకూరు	3.07	1.67	54.38
ఆత్మకూరు	5.84	3.49	59.82
నందికొట్కూరు	10.50	5.69	54.24
పాణ్యం	4.10	1.25	30.53

వైద్యశాలకు వెళ్లే దారేదీ?

ఆత్మకూరు పట్టణంలోని సీహెచ్‌సీకి రోజూ వందలాది మంది వైద్య కోసం వస్తుంటారు. రోగులు ఓపీ కోసం నిరీక్షించే స్థలంలో పెద్దఎత్తున ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ఓపీ తీసుకునేందుకు వెళ్లే రోగులకు అవస్థలు తప్పడం లేదు. అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలను దాటుకుని వెళ్లే సరికి నీరసమొస్తోందని రోగులు వాపోతున్నారు. 108 వాహనం ఆసుపత్రి ద్వారం వరకు వెళ్లాలన్నా, తిరిగి వెనక్కి మళ్లించాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం




నంద్యాల గాంధీచౌక్ : గ్రామోత్సవంలో నిమిషాంబదేవి


నంద్యాల గాంధీచౌక్ : వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయపీఠం


నంద్యాల గాంధీచౌక్ : వేంకటేశ్వరస్వామి పీఠం ఊరేగింపు


నందికొట్కూరు : వాసవీ కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం


జూపాడుబంగ్లా : దుర్గామాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మిన్నంటిన దసరా సంబరాలు

☛ గ్రామోత్సవాలతో ఊరూరా సందడి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. దసరా పండగను శనివారం ఊరూరా అట్టహాసంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఆలయాలను సందర్శించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శమీ వృక్ష దర్శనం చేసుకున్నారు. వివిధ ఆలయాల నుంచి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవాలను కనులపండువగా నిర్వహించారు. నవరాత్రులు నవ అలంకారాల్లో పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. రావణ ప్రతిమలను తగులబెట్టారు. ఈసందర్భంగా యువత సందడి చేశారు. కళాకారులు కాళిక, ఇతర విచిత్ర వేషధారణలతో అలరించారు.

– న్యూస్‌టుడే, నంద్యాల క్లస్టరు బృందం


వెలుగోడు : వాసవీమాత ఊరేగింపులో భక్తులు


నందికొట్కూరు : శమీ వృక్షం వద్ద బాలికల కోలాటం


ఆకట్టుకున్న దసరా వేషధారణలు


మిడుతూరు : భక్తుల మధ్య శమీ వృక్షం వద్దకు తరలుతున్న చెన్నకేశవస్వామి


ఆత్మకూరు : శమీ వృక్షానికి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


మహానంది : జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న గంగ, కామేశ్వరి సమేత మహానందీశుడు


ఆత్మకూరు : కరివేనలో అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న అతిథులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో దసరా పండగ సందర్భంగా ప్రదర్శించిన విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో మధుర స్వీట్స్, నంద్యాల బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ఎంపీ డా.బైరెడ్డి శబరి సౌజన్యంతో రూ.40 వేల ప్రథమ, శాంతిరాం విద్యా సంస్థల సంచాలకుడు మిద్దె శివరాం సహకారంతో రూ.30 వేల ద్వితీయ, అన్సర్ జ్యువెలర్స్ సౌజన్యంతో రూ.20 వేల తృతీయ బహుమతిని అందజేసినట్లు నిర్వాహకులు రాజా హుస్సేన్, లింగారెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొన్న కళాకారులకు గురు రాఘవేంద్ర విద్యా సంస్థల ఛైర్మన్ దస్తగిరి రెడ్డి, తులసిరెడ్డి, భవనాశి వాసు, మహేశ్ రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో బైటిపేట కాళీ బృందం, గుడిపాటిగడ్డ అయ్యప్పస్వామి ఆలయ బృందం, దుర్గా బృందం మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో తెదేపా నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ సంచాలకులు తాతిరెడ్డి తులసిరెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు మణియార్ ఖలీల్, కౌన్సిలర్ నాగార్జున, కళారాధన ప్రధాన కార్యదర్శి రవికృష్ణ, జనసేన నాయకుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు ప్రాంగణం..
ప్రయాణికులకు నరకం

నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో మురుగునీటి నిల్వతో దుర్గంధం వ్యాపిస్తోంది. కాలువలు లేకపోవడంతో ప్రయాణికులు తిరిగే ప్రదేశంలో మురుగు నిలిచి మడుగులా మారింది. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు నిలవకుండా కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం



పోటీలు సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : యువత క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు నూర్, అధ్యక్షుడు పస్పిల్ మున్నా, రాష్ట్ర వాలీబాల్ కోచ్, రైల్వే వాలీబాల్ క్రీడాకారుడు నిమ్మి కృష్ణయాదవ్, తెదేపా మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగూర్‌ఖాన్ పేర్కొన్నారు. ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను వారు ప్రారంభించారు. పల్నాడు జిల్లా పెద్దకూరపాడుకు చెందిన జీఆర్‌సీఆర్‌కే, విజయవాడకు చెందిన నాదెండ్ల బసవ పున్నయ్య ట్రస్టు జట్ల మధ్య మొదటి పోటీ జరిగింది. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెన్నా శ్రీధర్‌రెడ్డి, నాయకులు షఫీ తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న నూర్

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : వాతావరణంలో మార్పుల కారణంగా ఈనెల 16వ తేదీ వరకు భారీ వర్షాలు పడే ఆస్కారముందని ఏవో పవన్‌కుమార్ తెలిపారు. రైతులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి సాగులో ఉన్న పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పైర్లు పాలు పోసుకునే దశలో ఉన్నాయన్నారు. వర్షాలు అధికంగా కురిస్తే పొలాల్లో నీరు నిలవకుండా బయటికి పంపేందుకు మార్గాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పైపాటుగా వేసే ఎరువులను వేయొద్దని సూచించారు. శనగ పంటలు సాగుచేసే రైతులు వర్షాలు తగ్గిన తర్వాత విత్తుకోవాలని చెప్పారు. కంది పంటలు ప్రస్తుతం మొగ్గ, పూత దశలో ఉన్నందున పొలం గట్లను తెంచి వర్షం నీరంతా బయటికి వెళ్లేలా చూడాలన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

శ్రీశైలం, సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : ఆటల పోటీల్లో గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని శ్రీశైలం ఒకటో పట్టణ సీఐ ప్రసాద్‌రావు సూచించారు. శ్రీశైలం దేవస్థానం పరిధిలోని శివాజీ స్ఫూర్తి కేంద్రం మైదానంలో శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పది జట్లు పాల్గొన్న ఈ లీగ్‌లో ఎస్‌బీఎంఎస్ రవిస్వామి జట్టు మొదటి స్థానంలో నిలిచింది. పీఆర్-11 ద్వితీయ, నల్లమల టైగర్ తృతీయ, ఎస్ఆర్ఏ-11 నాలుగో స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకుడు బాబూరావు చెప్పారు. విజేతలకు కూటమి పార్టీల నాయకులు శ్రీనివాసరెడ్డి, అశోక్, రమణ బహుమతులు అందజేశారు.


గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న సీఐ ప్రసాద్‌రావు

వైభవంగా పెద్దమ్మ గ్రామోత్సవం

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని ఓంకారం క్షేత్రం నుంచి పెద్దమ్మ అమ్మవారి గ్రామోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి సోమయాజులపల్లె, శింగవరం గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వాసంతి.. క్రీడల్లో ఖ్యాతి



పాణ్యం, న్యూస్‌టుడే : ఆసక్తి.. పట్టుదలతో వివిధ క్రీడలు నేర్చుకుని విజయ పథంలో సాగుతోంది వెంకటవాసంతి. ఒక్క క్రీడలో రాణించడమే కష్టమైన పరిస్థితుల్లో.. పలు క్రీడలు నేర్చుకుని.. నిత్యం సాధన చేస్తూ నైపుణ్యం మెరుగుపర్చుకుంది. గురువుల ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొంటూ విజయాలు సాధిస్తూ ప్రశంసలు అందుకుంటోంది.

◆ గడివేముల మండలంలోని కరిమద్దెల గ్రామానికి చెందిన కె.వెంకటసుబ్బయ్య, మహేశ్వరి దంపతుల కుమార్తె వెంకటవాసంతి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. క్రీడల పట్ల ఆసక్తితో క్రికెట్‌తో పాటు హ్యాండ్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో ప్రతిభ చూపుతోంది. వ్యాయామ ఉపాధ్యాయుడు బాలవెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్ విద్యార్థినికి శిక్షణ ఇస్తూ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో వాసంతి జాతీయస్థాయిలో రాణిస్తోంది.

సాధించిన విజయాలు

◆ 2021లో ఆళ్లగడ్డలో నిర్వహించిన జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు మూడో స్థానంలో నిలవడంలో కీలకంగా ఆడింది.

◆ 2022లో తమిళనాడులో జరిగిన ఐదో జాతీయస్థాయి సబ్ జూనియర్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడి ప్రతిభ చూపింది.

◆ నంద్యాలలో నిర్వహించిన 66వ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడల్లో 14 ఏళ్ల విభాగం త్రోబాల్ పోటీల్లో రాణించి జిల్లా జట్టును విజేతగా నిలిపింది.

◆ 2022లో నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఆడి జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపింది.

◆ గత సెప్టెంబరులో మండలస్థాయిలో నిర్వహించిన పాఠశాల క్రీడల్లో షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో ప్రథమ స్థానం సాధించింది.

ఠాణాలో అనుమానితుల అప్పగింత

మిడుతూరు, న్యూస్‌టుడే : మండలంలోని తలముడిపి గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను గ్రామస్థులు పట్టుకుని మిడుతూరు పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ముగ్గురు నిందితులు శనివారం ఏకేఆర్ క్యాంపు వద్ద ఉన్న మోటార్ల తీగలను చోరీ చేసి అలగనూరు జలాశయం వద్ద ఉన్న వేసవి నీటికుంట భవనాల వద్ద కాల్చుతుండగా పట్టుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

వాహనదారులకు జరిమానా

గాజులపల్లె (మహానంది), న్యూస్‌టుడే : నిబంధనలు ఉల్లంఘించిన 20 మందికిపైగా వాహనదారులకు జరిమానా విధించినట్లుగా ఎస్సై ఎన్.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మహానంది మండలం గాజులపల్లె మెట్టలోని నాలుగు రస్తాల కూడలిలో ఆదివారం రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. సరైన అనుమతి పత్రాలు లేని వాహనదారులు, పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోల నిర్వాహకులకు జరిమానా విధించామన్నారు.

అక్రమ కేసు తొలగించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేసిన భూమా చెంచిరెడ్డిపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రామచంద్రారెడ్డి, కేవీ శివయ్య డిమాండ్ చేశారు. 35 ఏళ్లు ఉపాధ్యాయునిగా పనిచేసిన ఆయనపై ఓ ఘటనకు సంబంధించి సమగ్ర విచారణ చేయకుండానే ఓసు పెట్టడం తగదన్నారు.

ప్రమాదంలో వృద్ధురాలి మృతి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని బలపనూరు మెట్ట సమీపంలో జాతీయ రహదారిపై వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు (60) మృతి చెందినట్లు ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారుజామున నంద్యాల వైపు నడిచి వెళ్తున్న వృద్ధురాలిని వాహనం ఢీకొట్టిందన్నారు. ప్రమాదంలో ఆమె మృతదేహం గుర్తుపట్టలేనంతగా నుజ్జునుజ్జయిందన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవన్నారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో ఉంచినట్లు తెలిపారు.

కామేశ్వరీదేవికి బంగారు తాళిబొట్ల బహూకరణ

మహానంది, న్యూస్‌టుడే : మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి ఐదు గ్రాముల బరువు గల రెండు బంగారు తాళిబొట్లను దాతలు విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్, శ్రావణి దంపతులు ఆదివారం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం వారు ప్రొటోకాల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, వేదపండితులకు బంగారు తాళిబొట్లు అందజేశారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక

గడివేముల, న్యూస్‌టుడే : ఆర్యవైశ్య సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం పెద్దలు తెలిపారు. మండల అధ్యక్షిడిగా కరిమద్దెల గ్రామానికి చెందిన ఉదయగిరి శివయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. గడివేముల కమిటీ అధ్యక్షుడిగా మధుసూదనగుప్తా, కార్యవర్గ సభ్యులుగా రాఘవేంద్ర, మహేష్, మల్లికార్జున, షణ్ముఖసాయి, రామ్‌సాయి, సాయికుమార్, లక్ష్మీనారాయణను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.


ఉదయగిరి శివయ్యను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్



గ్రంథాలయాన్ని ప్రారంభించిన పల్లె నరసింహారెడ్డి

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లోని యువకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత గ్రంథాలయాధికారి, ప్రకృతి పీఠం వ్యవస్థాపకుడు పల్లె నరసింహారెడ్డి పేర్కొన్నారు. వల్లంపాడు గ్రామంలో ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో భారత్ గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలన్నారు. ఎవరైనా ఆసక్తి ఉన్నవారు ముందుకు వస్తే ప్రతి గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సర్పంచి జగదీశ్వరరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: వృత్తి విద్యకు సంబంధించిన కోర్సుల్లో శిక్షణ నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పాఠశాల తాత్కాలిక ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి సూచించారు. దసరా సెలవుల్లో సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వృత్తి విద్యా కోర్సు విద్యార్థులకు పది రోజుల ఇంటర్న్‌షిప్ నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల: సమస్య: వనికెన్‌దిన్నె బీసీ కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. **–పుణ్యవతి.**
సమాధానం: చర్యలు తీసుకుంటాం.
–షరీఫ్‌ఉన్నీసా, సచివాలయ పంచాయతీ కార్యదర్శి.

బనగానపల్లి గ్రామీణం: ప్రశ్న: ఇల్లూరుకొత్తపేటలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో మురుగు నిలిచింది. **–రంగమ్మ.**
జవాబు: ఇబ్బందులు లేకుండా చేస్తాం.
–వెంకటరమణ, ఎంపీడీవో, బనగానపల్లి

ప్రశ్న: పలుకూరులోని ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. **–రాముడు.**
జవాబు: చర్యలు తీసుకుంటాం.
–గర్జప్ప, విద్యుత్తు శాఖ ఏఈ, బనగానపల్లి.

అవుకు: సమస్య: రామపురం ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. **–దానమయ్య.**
జవాబు: పరిష్కరిస్తాం. **–పక్కీరయ్య, ఏఈ, అవుకు.**

సమస్య: ఓబుళాపురంలో తాగునీటి గొట్టాల నుంచి వచ్చే నీటివల్ల వీధులన్నీ మురుగుతో నిండిపోతున్నాయి. **–సుబ్బరాయుడు.**
జవాబు: త్వరలో పరిష్కరిస్తాం.
–సుధాకర్, పంచాయతీ కార్యదర్శి శింగనపల్లె.

కోటకందుకూరు(ఆళ్లగడ్డ గ్రామీణం): సమస్య: ఎస్సీ కాలనీలో నీరు కుళాయిలకు సరిగా సరఫరా కావడం లేదు. **–యేసు, నల్లగట్ల.**
సమాధానం: చర్యలు తీసుకుంటాం.
–రామకృష్ణ, సర్పంచి.

సమస్య: కోటకందుకూరులో ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. **–ఓబులేసు**
సమాధానం: చర్యలు తీసుకుంటాం. **–రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి.**

బనగానపల్లి: సమస్య: రంగరాజుపేటలో మురుగు రోడ్డుపై చేరి దుర్వాసన వస్తోంది. **–దాదా బాషా.**
సమస్య: కొండపేటలోని ప్రధాన రహదారిలో రోడ్డుపై మురుగు పారుతోంది. **–సుబ్బారెడ్డి.**
సమాధానం: చర్యలు తీసుకుంటాం.
–సతీష్ కుమార్‌రెడ్డి, ఈవో.

ఎమ్మెల్యేను కలిసిన సుబ్బారెడ్డి



ఎమ్మెల్యే బుడ్డాను కలిసిన ధర్మవరం

డోన్, న్యూస్‌టుడే: శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మైనరుకు వివాహం

కర్నూలులోని చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ హోమ్‌కు తరలింపు

అవుకు, న్యూస్‌టుడే: నిర్ణీత వయసు లేకుండానే మైనర్ బాలికకు వివాహం చేశారని తెలియడంతో కర్నూలు ఐసీపీఎస్ కార్యాలయానికి ఆమెను తరలించామని అధికారులు వివరాలు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన గిరిజన బాలిక (16)ను చాగలమర్రి మండలానికి చెందిన ఓ తండా యువకుడితో ఆదివారం వివాహం జరిపిస్తున్నారని బనగానపల్లి ఐసీడీఎస్ కార్యాలయానికి సమాచారం అందడంతో సీడీపీవో, రెవెన్యూ పోలీసులు వెళ్లారు. అప్పటికే పెళ్లయినట్లు తెలియడంతో బాలికను అదుపులోనికి తీసుకొని రెండు కుటుంబాల వారికి అవగాహన కల్పించారు. బాలిక వయసు పదహారేళ్లు కావడంతో మరో రెండేళ్ల వరకు ఆగాలని చెప్పడంతో కుటుంబసభ్యులు అంగీకరించడంతో బాలికను కర్నూలులోని చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ హోంకు తరలించారు. బాలికకు అన్ని విషయాలు తెలియజేశాక ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తల్లిదండ్రులకు బాలికను అప్పగించనున్నట్లు ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు శివమ్మ తెలిపారు.

పల్లెలకు పండగొచ్చింది

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గడిచిన వైకాపా ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక సమస్యలతో కొట్టుమిట్టాడాయి. గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి కేటాయించకపోవడంతో ఎటువంటి అభివృద్ధి పనుల్నీ సర్పంచులు చేపట్టలేక అల్లాడిపోయారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు లేక గ్రామాల్లో జనం అవస్థలు పడ్డారు. వర్షాకాలంలో దారులన్నీ బురదగా మారడంతో రాకపోకలు సాగించడం కష్టమైంది. కాల్వలు లేక మురుగు ఇళ్ల మధ్య, దారుల్లో పొంగుతుండటంతో ఇబ్బందులుపడ్డారు. కనీసం కాల్వల్లో చెత్తను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నా నిధులు లేక గ్రామస్థాయి పాలన అస్తవ్యస్తంగా మారింది.



తారురోడ్డు మంజూరైన ఎం.గోవిందిన్నె మట్టిదారి

నియోజకవర్గంలోని గ్రామాల్లో గ్రామసభల ద్వారా పనులను గుర్తించి సీసీ రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని నిర్ణయించారు. ఐదు మండలాలు కలుపుకొని మొత్తం 145పనులు గుర్తించారు. వాటిని పూర్తి చేసేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.20 కోట్లు కేటాయించారు. కోవెలకుంట్ల మండలంలో 23 పనులను గుర్తించి రూ.3.3 కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా మండలంలోని ఎం.గోవిందిన్నె మెట్ట నుంచి గ్రామానికి వెళ్లేందుకు సరైన రహదారి లేదు. 2009లో వరదలకు మట్టిదారి పూర్తిగా దెబ్బతిని, కల్వర్టు ధ్వంసమైంది. అప్పటి నుంచి పట్టించుకునేవారు లేక గ్రామస్థులు మట్టిదారిలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మెట్ట నుంచి గ్రామానికి 1.5 కిలో మీటర్లు తారు రోడ్డు, కల్వర్టు నిర్మించేందుకు రూ.1.60కోట్లు కేటాయించారు. కోవెలకుంట్లలోని శివారు కాలనీలైన సాయినగర్, సీతారామనగర్, సుంకులమ్మగుడి, ఆటోనగర్ కాలనీల్లో ఏళ్ల నుంచి అసౌకర్యాలు నెలకొన్నాయి. కేటాయించిన నిధులతో సీసీ రహదారులు, మురుగు కాల్వలు నిర్మించనున్నారు. ఇలా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెట్టనుంది.

మండలాలవారీగా గుర్తించిన పనులు, కేటాయించిన నిధులు		
మండలం	పనులు	నిధులు (రూ.కోట్లల్లో)
బనగానపల్లి	38	5.6
కోవెలకుంట్ల	23	3.3
కొలిమిగుండ్ల	26	3.25
అవుకు	29	3.5
సంజామల	29	4.35

కూటమి రాకతో పండగ: కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లోనే గ్రామాలకు మహర్దశ పట్టింది. సీసీ రహదారులు, మురుగు కాల్వల ర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ నిధులను కేటాయించారు. ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు కేటాయించడంతో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో గ్రామాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఆశిస్తున్నారు.

☛ **14నుంచి గ్రామాల్లో ...:** గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈనెల 14 నుంచి ప్రభుత్వం అన్ని గ్రామాల్లో పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనుంది. తేదీల వారీగా ఆయా గ్రామాల్లో గుర్తించిన పనులకు పండగ వాతావరణంలో భూమిపూజలు చేసి పనులు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అందరూ పాల్గొనేలా షెడ్యూలు రూపొందించారు.

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

చాగలమర్రి: గ్రామాల్లో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలను జయప్రదం చేయాలని మండల పరిషత్ ఏవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈనెల 14 నుంచి 20 వరకు పంచాయతీల వారీగా నిర్వహిస్తామని వివరించారు. సచివాలయ, ఉపాధి సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు.

అవుకు: ఆకుమళ్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటక్రిష్ణయ్య (55) మృతికి మండలాధ్యక్షుడు చల్లా రాజశేఖరరెడ్డి సంతాపం ప్రకటించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

సంజామల, న్యూస్‌టుడే: ఆల్వకొండ సమీపాన నలుగురు జూదం ఆడుతున్నట్లు తెలియడంతో సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నామని ఎస్సై రమణయ్య తెలిపారు. వారి నుంచి రూ.3,450 స్వాధీనం చేసుకున్నామన్నారు.

డోన్, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతిని ప్రభుత్వమే పండగలా నిర్వహణకు కృషి చేయడం సంతోషించదగ్గ విషయమని తెదేపా రాష్ట్ర కార్యదర్శి వలసలరామకృష్ణ అన్నారు. ఈనెల 17న డోన్‌లో వాల్మీకి జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారన్నారు.

డోన్, న్యూస్‌టుడే: గాయపడిన లారీడ్రైవర్ కొండపేటకు చెందిన చాకలిరాము మృతి చెందడంతో డోన్ మోటార్‌వర్కర్స్ యూనియన్ నాయకులు శివరాం తదితరులు నివాళులు అర్పించారు.

డోన్, న్యూస్‌టుడే: మానవ హక్కుల నేత ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులు అర్పించారు. పాతబస్టాండులోని గాంధీ సర్కిల్‌లో సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మృతి సమాజానికి తీరని లోటని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా అధ్యక్షుడు జి.కరుణాకరరావు, ప్రధాన కార్యదర్శి జీవీల్ నరసింహుడు ప్రకటనలో తెలిపారు.

డోన్, న్యూస్‌టుడే: పేదల ఆకలి తీర్చేందుకు దాతలసాయం గొప్పదని ప్రార్థనాసమయం నిర్వాహకుడు జానప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ దాత సహకారంతో రోగులకు రొట్టెలు, పండ్లు అందజేశారు.



ఆళ్లగడ్డ: కాళికామాత వసంతోత్సవం



చాగలమర్రి: ఉత్సాహంగా కోలాటం

జగన్మాత... శతకోటి వందనాలమ్మా!

విజయదశమిని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని మనసారా కొలిచారు. కల్పవల్లి.. శరణు.. శరణు అంటూ మొక్కారు. నీ చల్లని చూపులే మాకు రక్ష అంటూ ప్రార్థించారు. –న్యూస్‌టుడే బృందం



కోవెలకుంట్ల: భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



యర్రగుంట్లలో అమ్మవారు



హరివరంలో ఉమా మహేశ్వర్ల గ్రామోత్సవం



ఉడుములపాడు సమీపంలోని సుంకులమ్మ



ప్యాపిలి: అమ్మవారికి పూజలు



పేరుసోములలో...



బేతంచెర్ల: పల్లకిపై వాసవీమాత ఊరేగింపు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హరివరం(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: మండలంలోని హరివరం ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2006-2007 ఏడాదిలో పదోతరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. నాటి విషయాలను గుర్తుకుతెచ్చుకుని అప్పటి విషయాలను మాట్లాడుకున్నారు. అనంతరం గురువులకు విద్యార్థులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.



గురువులతో కలిసిన విద్యార్థులు

వాలీబాల్ విజేత బాచేపల్లె

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సిద్దిక్ మెమోరియల్ రాయలసీమ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో బాచేపల్లె జట్టు విజేతగా నిలిచింది. తుదిపోరులో బాచేపల్లె, చాగలమర్రి సిద్దిక్-2 జట్లు తలపడగా బాచేపల్లె జట్టు ఆధిక్యంతో విజయం సాధించి విజేతగా నిలిచింది. మూడో స్థానంలో ఖాజీపేట జట్టు నిలిచింది. విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలను గడేకారి మహ్మద్ అందజేశారు. ద్వితీయ బహుమతి రూ.7వేలు అలంసాగారి ఖలీల్, ఆకుల ఇర్షాద్, మూడో మహుమతి రూ.5వేలు పీడీ దాదాపీర్ అందజేశారు. నిర్వాహకులు షరీఫ్, భార్గవ్, అలీ, నరేష్, అబుబకర్, జుబేర్, అల్తాఫ్, షాహిద్, అలెక్స్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

ఆదర్శ పాఠశాల విద్యార్థుల సత్తా

రుద్రవరం, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో కాంస్య పతకాలను సాధించినట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగ కుస్తీ పోటీల్లో నాగదినేష్, సాయికుమార్, శశిధర్ ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.



విజేతలతో పీడీ శ్రీనివాసులు

చిత్ర యూనిట్‌కు అభినందన



కేకు కోస్తున్న బాలుగాని టాకీస్ సినిమా చిత్ర యూనిట్ సభ్యులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: 'ఆహా' నిర్మాణంలో విశ్వనాథ్ ప్రతాప్ దర్శకత్వంలో తీసిన 'బాలుగాని టాకీస్' సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోందని ఆదివారం స్థానిక పాతబస్టాండులో 'డి స్టూడియో డ్యాన్స్ అకాడమీ'లో చిత్ర యూనిట్ సభ్యులు అభినందన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కేకు కోసి సంబరాలు జరిపారు.

రూ.50 వేల విరాళం అందజేత



విరాళం ఇస్తున్న రణధీర్‌రెడ్డి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో అనాథ పిల్లల కోసం నిర్మిస్తున్న ఆశ్రమానికి కోవెలకుంట్లకు చెందిన రామసుబ్బారెడ్డి, స్రవంతి దంపతుల కుమారుడు రణధీర్‌రెడ్డి రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ దాతల సాయంతో తమ వద్ద ఉన్న అనాథల కోసం ఆశ్రమం నిర్మిస్తున్నామని, తమకు ఆర్థిక సాయం అందించిన రణధీర్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని దాతలు ముందుకు రావాలన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తెదేపా అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం కమ్మవారిపల్లెలో రైతులకు విత్తనాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న రామేశ్వరరెడ్డి

రేణుకాఎల్లమ్మ దేవి ఆలయ కమిటీ ఎన్నిక

డోన్, న్యూస్‌టుడే: కొండపేటలోని రేణుకఎల్లమ్మ దేవి జ్యోతిర్లింగేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆలయ నిర్వాహకులు ఏఈ నాగరాజు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసగౌడ్, ఉపాధ్యక్షుడిగా అనుపాటి ఉమాశంకర్, కార్యదర్శిగా అనుపాటి నాగరాజు, కోశాధికారిగా అర్చిత, కార్యవర్గ సభ్యులుగా శ్రీరాములుగౌడ్, అభివృద్ధి కమిటీ సభ్యులుగా రంగనాథ్, రంగన్న, సురేష్‌రావు, రామ్మోహన్, నాగభూషణం తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు .

డీఎస్పీకి సన్మానం

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి నాయీబ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు పాతపాడు శ్రీరాములు అధ్వర్యంలో డీఎస్పీ కృష్ణమోహన్ దంపతులకు ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతపురం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో సీఐగా పనిచేస్తున్న కృష్ణమోహన్‌కు డీఎస్పీగా పదోన్నతి రావడంతో రాయచోటికి బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో స్థానిక సంఘం ఆయన్ని సన్మానించింది. డాక్టర్ ఎంఆర్ శ్రీనివాసులు, పీవీ శివయ్య, రామకృష్ణయ్య, మద్దిలేటి, మల్లికార్జున, రామమద్దిలేటి, సభ్యులు పాల్గొన్నారు.



డీఎస్పీ కృష్ణమోహన్ దంపతులకు సన్మానం చేస్తున్న నాయకులు

అధ్వాన రోడ్లతో అవస్థలు



కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్‌లో రహదారులు అధ్వానంగా మారాయి. బస్సులు బస్టాండ్‌లోకి ప్రవేశించే మార్గంలో సీసీ రోడ్డంతా పగుళ్లతో గోతులుగా మారింది. వర్షాకాలంలో వర్షపునీరు గుంతల్లో నిలిచి వాహనాలు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దారుల్ని బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

నియంత్రిక...ప్రమాదాల సూచిక

దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు నుంచి హరివరానికి వెళ్లే రోడ్డు మార్గంలో నియంత్రికలు ప్రమాదకరంగా మారాయి. రహదారికి ఇరువైపులా ముళ్లపొదల్లో ఉన్న వాటి గురించి ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవటం లేదు. రోడ్డుపై వెళ్లే వాహనదారులు అదుపు తప్పితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. . దీనిపై ఆదివారం ట్రాన్స్‌కో అధికారి రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లగా...నియంత్రికల వల్ల ఎలాటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకొంటామని చెప్పారు. –న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ



రాకపోకలకు ఇబ్బందులే



ట్రాఫిక్ సమస్య తరచూ వేధిస్తోంది. రద్దీ ప్రాంతాల్లో అధ్వానంగా మారింది. శ్రీరామా థియేటర్ వద్ద, స్టేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు వద్ద, పాతబస్టాండులో, కంబాలపాడు సర్కిల్ నుంచి ప్రధాన రహదారిలో, బేతంచెర్ల ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతోంది. సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

బాలుడి మృతదేహం లభ్యం

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని యాగంటిపల్లికి చెందిన మధురుషి(12) ఈనెల 8న గాలేరునగరి కాలువలో గల్లంతైన సంగతి తెలిసిందే. శనివారం బాలుడి మృతదేహాన్ని అవుకు చెరువు వద్ద గుర్తించారు. మృతదేహాన్ని బనగానపల్లి వైద్యశాలకు శవపరీక్ష నిమిత్తం తరలించారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

అవుకు, న్యూస్‌టుడే: మండలంలోని చెర్లోపల్లెలో వ్యక్తిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరమణపై అదే గ్రామానికి చెందిన వడ్డె వెంకటేశ్వర్లు ఆయన కుమారులు దాడి చేశారనే ఫిర్యాదు అందిందన్నారు. అప్పు చెల్లింపు విషయంలో రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదమే దాడికి ప్రధాన కారణమని తెలుస్తోందన్నారు. దాడిలో గాయపడిన వెంకటరమణ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నారని, బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లు ఆయన కుమారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కోవెలకుంట్ల మండలంలోని సౌదరదిన్నెలో ఆదివారం రాత్రి జరిగింది. ఇల్లూరి కొత్తపేటకు చెందిన మహబూబ్‌బాషా (35) బనగానపల్లి నుంచి కోవెలకుంట్లకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. సిమెంటు లారీ బనగానపల్లి నుంచి చెన్నైకు బయలుదేరుతూ కోవెలకుంట్ల మండలంలోని సౌదరదిన్నె గ్రామంలో శుద్ధజల కేంద్రం దగ్గర ఆగింది. ఆగి ఉన్న ఈ లారీని మహబూబ్ బాషా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై తెలిపారు.

సీతాఫలం.. ఆదాయమార్గం

డోన్, న్యూస్‌టుడే: సీతాఫలం పేరు చెబితే ఎవరికైనా నోరూరుతుంది. ఈ మధుర సీతాఫలం ఒక గ్రామానికి ఆదాయవనరుగా మారింది. ఏటా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం సమకూర్చేలా చేస్తోంది. రైతులు పండించిన పంట ద్వారా కాకుండా ప్రకృతి ప్రసాదితంగా వచ్చిన సీతాఫలం డోన్ మండలంలోని చనుగొండ్ల గ్రామం వారికి ఆదాయవనరుగా మారింది. ఇక్కడ సుమారు 5 వేలకు పైగా జనాభా ఉంటోంది. డోన్ నుంచి సుమారు రూ.25 కి.మీల దూరం ఉండే ఈ గ్రామానికి పక్కనే ఆనుకుని రెండు పెద్దకొండలు ఉన్నాయి. రెండుకొండల నడుమ ఈ గ్రామం ఉంది. ఈ కొండ ప్రాంతాల్లోనూ, గ్రామానికి సమీపంలో ఉండే పరిసరాల్లోనూ, పొలాలకు వెళ్లే రహదారుల వెంట పొలాల సమీపంలోనూ దాదాపు 10 వేలకు పైగా సీతాఫలాల చెట్లు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి ఈ గ్రామ సీతాఫలం ఎంతో పేరు పొందింది. డోన్ మండలంలో పెద్దఎత్తున ఇక్కడి నుంచే వస్తాయి. ఒక్కో చెట్టు నుంచి 40 నుంచి 50 వరకు కాయలు వస్తుంటాయి. ఇలా వేలాది చెట్లు టన్నుల కొద్దీ పండ్ల దిగుబడులను ఇస్తాయి. డోన్‌తో పాటు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఈ సీతాఫలాలను తరలిస్తుంటారు. చనుగొండ్ల గ్రామంలో పండే సీతాఫలాల చెట్లను ప్రతి ఏటా గ్రామపెద్దలంతా కలసి వేలం వేస్తారు. 25 ఏళ్లుగా ఇలా గ్రామ సమీపంలోని చెట్లను వేలం వేసి ఆదాయాన్ని పొందుతున్నారు. ఆ ఏడాది సీజన్, కాపును బట్టి వేలం వేస్తారని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం కొన్నేళ్లుగా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వేలం ద్వారా ఆదాయం వస్తోందంటున్నారు. ఈ ఏడాది రూ.52 వేలకు పైగా వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామంలోని ఉత్సవాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగిస్తామని స్థానికులు చెబుతున్నారు. గ్రామపెద్దలంతా కలసికట్టుగా ఈ వేలం పాటను ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగిస్తున్నారని, ఇలా సీతాఫలం ప్రతి ఏటా ఆ గ్రామానికి చక్కటి ఆదాయాన్ని ఇస్తోందని స్థానికులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



చనుగొండ్ల కొండ ప్రాంతంలోని సీతాఫలం చెట్టు